# మెరుపుకల

ఆరోజు సాయంత్రం అయిదు గంటలు కావొస్తోంది. చేతిలో రోజా పువ్వును పట్టుకునీ, ప్రేమించిన అమ్మాయికోసం ఎదురు చూస్తూ ఇంటిముందు నిలుచున్నాను. ఆమె కోసం దొంగచూపులు చూస్తున్నాను. ఆమె దూరం నుంచి రానే వచ్చింది. నేను ఒక్కసారిగా ఆమెను చూశాను. ఏదో తెలియని తొందర. హృదయంలో జ్వాల. కాళ్ళు, చేతులు వణుకుతున్నాయి.

ఆమె నా వైపే చూస్తూ మెల్లగా ఒక్కో అడుగు వేస్తూ నడుస్తోంది. సరిగా నిలబడక, నా తనువంతా చెమటతో నిండిపోయింది.

ఆ అమ్మాయి నన్ను చూసి నవ్వింది. ఎందుకు నవ్విందో ఆమె మొహం చూస్తే తెలిసింది. ఆమె నన్ను చూసి నవ్వలేదు. నా చేతిలో వణుకుతున్న చిట్టి రోజా పువ్వును చూసి నవ్విందని, పిచ్చిది ఆమె కోసమే ఈ రోజాపువ్వని తెలియదు పాపం.

నా మనసులోని మాటను ఆమెకు ఎలా చెప్పను, ఏమని చెప్పను? నిన్ను ప్రేమిస్తున్నానని చెప్పనా, నువ్వే నా ప్రేయసివని చెప్పనా, లాభం లేదు. ఆమె ఇంకా నా దగ్గరగా వస్తోంది. ఆమె ఎదుట కొంచెం హృదయాన్ని పదిలపరిచి, చెబుదామని చూస్తూ ప్రయత్నిస్తున్నాను. వచ్చింది. రానే వచ్చింది. ఇంకా నా కాళ్ళు, చేతులు వణుకుతునే వున్నాయి. ఏం మాట్లాడాలో తెలియక మాటలు రాని మూగవాడిలా నిలుచున్నాను.

ఎలాగైనా ఈసారి తప్పనిసరిగా చెప్పాలని తపన.

ఆమె నా ఎదుట నిలబడి ఆగింది. నన్ను చూసింది. కానీ నేను ఆమెను చూడలేకపోతున్నాను. చిరునవ్వు నవ్వింది. నేనూ నవ్వుదామని ప్రయత్నిస్తున్నా, కాని నవ్వు రావట్లేదు.



ఫ..ఏ జన్మలో చేసుకున్న పాపమో, ఈ జన్మలో నాకు ఇలా చేశాడు ఆ దేవుడు. 'దేవుడా..ఒక్కసారి ఆమెతో మాట్లాడే అవకాశాన్ని కలిగించు స్వామీ' అనుకున్నాను.

నా చేతిలో వున్న ఆ రోజా పువ్వు ఆమెకు ఇద్దామనీ మెల్లిగా నా చేయి పైకెత్తి రోజాపువ్వును ఆమె పెదాల దగ్గర వుంచాను. కానీ ఎందుకో నాకు భయం వేస్తోంది. ఆమెను నా కళ్ళతో ప్రశాంతంగా చూద్దామనుకున్నా. కానీ చూడలేక క్రిందికి చూస్తున్నాను. ఆమె మాత్రం నన్నే చూస్తూ నవ్వుతూ ఉంది. ఏం జరుగుతుందో తెలియడం లేదు. ఒక్కసారే ప్రాణం లేని జీవిగా, మౌనం, నిశ్శబ్దం అన్నీ ఆవరించాయి నాలో. ఆమె మెల్లిగా చెయ్యి పైకెత్తి నా చేయి పట్టుకుంది.

చెప్పలేని పరిస్థితి. సముద్రం ఉప్పొంగినంత నా మనసు ఉప్పొంగుతుంది. నా తనువంతా షాక్ కొట్టినట్టయ్యింది. ఇంకేముందీ. ఆ రోజా పువ్వు జారీ ఆమె కాళ్ళ మీద పడింది. అప్పుడు ఆమెకు అర్థం అయింది. నేనామెను అమితంగా ప్రేమిస్తున్నానని. నా ప్రేమ సంగతి ఆమెకి ఎలా చెప్పాలో నాకు అర్థం కావడం లేదు. మూగబోయాను. చిన్నగా నా చేయిని తన పెదాల దగ్గరకు తీసుకుంది. ముద్దాడి 'ఐ లవ్ యూ' అని చిన్నగా చెప్పింది. ఏం చేయాలో, ఏం మాట్లాడాలో తెలియక పిచ్చోడిలా చూశాను.

నా చేతిలో ఉన్న రోజాపువ్వు ఒకావిడ తీసుకొంది నాకే ఇద్దామనీ. నాకు ప్రాణం వచ్చింది. కళ్ళు తెరచి చూశాను. ఆమె కనిపించలేదు. ఒకావిడ చేతిలో రోజాపువ్వును చూశా. నవ్వుకుంటూ వెళ్ళిపోతోంది ఆమె. అప్పుడనుకున్నా ఇది మెరుపుకలని.

**-జి.సుధాకర్** (జనగామ)




